# కవిత్వంలో నేను

మరికొన్ని వ్యాసాలు



విన్నకోట రవిశంకర్

# వ్యాసాల వరుస


| | | |
|---|---|---|
| ⌘ | ప్రతీకగా శరీరం | 11 |
| ⌘ | కళలు ప్రేరేపించే సృజన | 16 |
| ⌘ | చీకటి చిత్రాల మీద కాంతి కిరణం | 23 |
| ⌘ | పొదుపైన పదచిత్రాలు | 29 |
| ⌘ | చేతిలో ఒదిగిన రాత్రి శకలం | 37 |
| ⌘ | అమెరికా పర్యాటకుల రెండు పుస్తకాలు | 43 |
| ⌘ | ప్రవాస కవిత్వంలో వెలుగు నీడలు | 53 |
| ⌘ | వైదేహి పునశ్చరణం | 60 |
| ⌘ | ఇస్మాయిల్ గారి కవితాతత్వం | 64 |
| ⌘ | కవిత్వంలో నేను | 72 |
| ⌘ | ఏటి ఒడ్డున ఒక పరిచయం | 80 |
| ⌘ | పోగొట్టుకొన్నవాడి పాట | 84 |
| ⌘ | నవీన్ నవలల్లో కొన్ని ప్రత్యేకతలు | 88 |
| ⌘ | నవీన్ పాటించిన కొన్ని విలువలు | 93 |
| ⌘ | వాన వెలిసిన సాయంత్రం | 97 |
| ⌘ | విభిన్న అనుభవాల సమాహారం | 102 |
| ⌘ | ఆత్మార్పణ తొలి పలుకులు | 105 |
| ⌘ | తెనుగుతోట పరిచయం | 110 |
| ⌘ | నాన్నగారి అలవాట్లు - కొన్ని జ్ఞాపకాలు | 115 |
| ⌘ | ఇస్మాయిల్‌గారితో నా పరిచయం | 119 |
| ⌘ | శ్రీశ్రీ కవిత్వంలో కొన్ని సామాన్య జీవనాంశాలు | 124 |
| ⌘ | సినిమా పాటల్లో కొన్ని రచనా విశేషాలు | 135 |
| ⌘ | కవిత్వానికి ప్రేరణ | 145 |
| ⌘ | కవిత్వంలో ప్రయోగాలు | 154 |

* దేవుని పాత్ర 163
* కవిత్వమనేది కవికి, పాఠకునికి మధ్య జరిగే ప్రత్యేకమైన సంభాషణ (ఇంటర్వ్యూ) 174

## మంచి కవితతో కొంచెంసేపు

**(కౌముది అంతర్జాల పత్రికలో 2007-08లో నిర్వహించిన శీర్షిక నుండి)**

* బనలతా సేన్ 187
* నల్లగేటూ నందిర్ధనం చెట్టు 190
* వేలిముద్రల పర్వతారోహణం 196
* నీ మీద చేయి వేస్తే ఒట్టు 199
* నిరంతర యాత్ర 202
* కాన్వాసుపై ఆమె 205
* కుండలో వెన్నెల 210
* వలసపోయిన మందహాసం 213
* పూబాల 217
* నవనవం 219
* చిల్మన్ 222
* ఆత్మకథ 227
* ఒక్కసారి వచ్చి పోరా... 233
* నాన్న తన కూతుళ్ళతో... 239
* పడవ నిద్ర 243
* వాయుశిల్పం 246
* ఒకటికి ఒకటి 250
* మృత్యువుతో తొలి పరిచయం 257
* కర్ణుడు 261
* తిరిగిరాని నాన్న కోసం 266
* సాలెపురుగు 271
* వ్యక్తిగతం 275

# ప్రతీకగా శరీరం

ఈ క్రింది అన్నమయ్య పదం విన్నప్పుడల్లా నాకు ఆశ్చర్యం కలుగుతుంది.

'నిత్యపూజలివిగో నేరిచినవో

ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి'

పల్లవి చూస్తే మామూలు సంకీర్తనలాగే అనిపించవచ్చు. నిత్యపూజ అనే ముఖ్య పదం తప్పించి ఇందులో విశేషమేమీ లేదు. ఇక మొదటి చరణం..

తనువే గుడియట తలయే శిఖరమట

పెను హృదయమే హరిపీఠమట

ఈ రెండు పాదాలు వినగానే మొత్తం సంకీర్తనని ఎలా రూపొందించబోతున్నాడో మనం ఊహించవచ్చు. మొదటిసారి విన్నప్పుడు శరీరాన్ని మాత్రమే ప్రతీకగా చేసి మిగతా సంకీర్తననంతటిని ఎలా నిర్వహిస్తాడో చూడాలని నాకు అత్యంత ఉత్సాహం కలిగింది. ఈ సంకీర్తన మిగతా భాగం ఇలా నడుస్తుంది...

కనుగొన చూపులే ఘనదీపములట

తన లోపలి అంతర్యామికిని.

పలుకే మంత్రమట పాదైన నాలుకే

కలకలమను పిడి ఘంటయట

నలువైన రుచులే నైవేద్యములట

తలపు లోపల నున్న దైవమునకు

గమన చేష్టలే అంగరంగ గతియట

తమిగల జీవుడే దాసుడట

అమరిన ఊర్పులే ఆలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని'

దేహాన్ని దేవాలయంగా అనేకమంది ఊహించి ఉండవచ్చు గాని, అలా అని ఊరుకోకుండా, ఇన్ని వివరాల్లోకి పోవటం వాటిని సమర్థవంతంగా చెప్పటం చాలా గొప్ప విషయం. ఇందులో వాడిన పోలికల్లో ఒక్కటి కూడా అసమంజసంగా అనిపించదు. చూపుల్ని దీపాలని, హృదయాన్ని పీఠమని, నాలుకని ఘంటని, ఊర్పుల్ని ఆలవట్టములని చెప్పటం – ఇవన్నీ ఎంతో సముచితమైన పోలికలు. అంతేగాక, దీనిలో మరొక విశేషం కూడా ఉంది. సాంప్రదాయకంగా భగవంతుణ్ణి అర్చించేటప్పుడు పాటించే క్రమం ఒకటుంటుంది. అది గుడైనా, ఇల్లైనా మొదట నివాసం, తరువాత కూర్చోవటానికి పీట, దీపారాధన, మంత్రం, నైవేద్యం, అటుపిమ్మట ఇతర సేవలు. ఇదే క్రమాన్ని పై సంకీర్తనలో ఎంత నిర్దిష్టంగా పాటించాడో మనం గమనించవచ్చు.

పాట మొత్తానికి ఒకే ఒక ప్రతీక, అందులోనూ విధిగా పాటించవలసిన ఒక క్రమం, వీటికి తోడు పద సంకీర్తనల నిర్మాణంలో సహజంగా ఉండే పదాల పరిమితి, యతిప్రాసల నియమం – ఇన్ని పరిమితులతో ఇంత చక్కటి రచన చెయ్యటం అనితరసాధ్యమనిపిస్తుంది.

ప్రముఖ మలయాళ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. సచ్చిదానందన్ కవితల అనువాదాల సంపుటి ఒకటి ఇటీవల ప్రచురింపబడింది. ఈ సంకలనం పేరు 'శరీరం ఒక నగరం'. ఈ శీర్షికతో ఇందులో ఒక కవిత ఉంది. పేరును బట్టే కవి దేనిని సంకేతిస్తున్నాడో మనకు స్పష్టమౌతోంది. శరీరాన్ని నగరంగా ఎందుకు భావిస్తున్నాడనే సందేహం మనకు కలుగుతుంది. కేవలం వైచిత్రి కోసమే చేస్తున్నాడా, ఇంకేదైనా గూఢార్థం ఇందులో ఉందా? బహుశా నగరజీవితంతో మమేకమైన కవి, నగరానికి తన శరీరానికి అభేదాన్ని పాటిస్తున్నాడేమో!

'నా శరీరమొక నగరం
నా కళ్లు కాపలా శిఖరాలు
అక్కడ నిరంతరం జాగ్రత్త
నా చెవుల మధ్య పొగబండి స్టేషన్
అక్కడ ఎప్పుడూ జనఘోష'

ఇలా మొదలై సుదీర్ఘంగా సాగే ఈ కవితలో లెక్కలేనన్ని పోలికలు చెప్పబడ్డాయి. నాడులు నదులని, నరాలు సంగీతాలు ప్రసరించే తీగలని, పళ్ళు కర్మాగారాలు, గ్రంధులు నిద్రలేని కర్మాగారాలని, చర్మం నిరీక్షణా కేంద్రమని, జుత్తులు సూర్యోదయాలు లేని ఉద్యానవనాలని – ఇంకా అనేకమైనవి. మరీ ఎక్కువ పోలికలు చెప్పటం వలన, కొన్ని అతికినట్టు సరిపోయినా, మరికొన్ని అంతగా నప్పలేదేమోనని నాకనిపించింది. పోలికలెక్కువైతే, పునరుక్తి చోటు చేసుకునే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకి, ఒక చోట నదులని చెప్పిన నాడుల్నే, మరొకచోట కూడలులని చెప్తాడు. అన్నమయ్య పదంలో ఉన్న బిగువు, క్లుప్తత ఈ పద్యంలో లేవు. అయితే, శరీరాన్ని నగరంగా భావించటం ఒక కొత్త ఊహ. ఆధునిక మానవునికి నగరంతో ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ కవిత సూచిస్తుంది. ఈ సంబంధం కవిత చివరి పంక్తుల్లో మరింత గాఢంగా వ్యక్తమౌతుంది:

ఈ శరీరాన్ని చితిపై వేసినప్పుడు
నువ్వు కాల్చేది ఒక నగరాన్ని
గుర్తుంచుకో! ఈ శరీరాన్ని పాతేసేటప్పుడు
మీరు పాతేది ఒక జనతని.

పై రెండు ఉదాహరణల్లోనూ ఒక సామ్యం ఉంది. వీటిలో శరీరాన్ని వేరొక దానికి ప్రతీకగా చెప్పటానికి వివిధ అవయవాలు ఆధారంగా తీసుకోబడ్డాయి. రెంటిలోనూ జీవించి ఉన్న మనిషి గురించే చెప్పబడింది. అయితే, ఇప్పుడు నేను తీసుకోబోతున్న మూడవ ఉదాహరణలో మాత్రం శరీరమే ప్రతీక అయినప్పటికీ, మిగతాదంతా భిన్నంగా ఉంటుంది. అది గ్రీకు మహాకవి, నోబెల్ ప్రైజు గ్రహీత Odysseus Elytis రాసిన ప్రసిద్ధ కవిత 'ది అటాప్సీ' ఈ కవితకు నేను చేసిన అనువాదం క్రింద ఇస్తున్నాను.

'ఇంకా ఆలివ్ వేళ్ళ బంగారు రంగు
అతని గుండె మూలల్లో ఇంకి ఉందని
వాళ్ళు కనుగొన్నారు.

ఉదయం కోసం ఎదురుచూస్తూ
కొవ్వొత్తి వెలుగులో ఎన్నిసార్లు గడిపాడో

# పొదుపైన పదచిత్రాలు

**క**విత్వం భాషకు, భావనకు ఉన్న పరిధుల్ని విస్తరింపజేస్తుంది. పదాల ఎంపిక, కూర్పు, కొత్త పదబంధాల సృష్టి వంటి సాధనాల ద్వారా ఇది సాధ్యపడుతుంది. ఇవేకాకుండా ఒక సన్నివేశాన్ని, తద్వారా కలిగిన అనుభూతిని వ్యక్తపరచటానికి పదచిత్రాలు లేదా ప్రతీకలను ఆధునిక కవులు విరివిగా వాడుకున్నారు. దీనిలో భాగంగా పోలికలు చెప్పటం, ఒక అనుభవానికి సంబంధించిన అతి సున్నితమైన వివరణనివ్వటం, మానవీకరణ – ఇలా రకరకాల ప్రక్రియలను వారు ఉపయోగించారు.

పోలిక చాలా సామాన్యమైన ప్రక్రియ. మంచి పోలికలు కవి ఊహాశక్తికి గీటురాళ్ళుగా పనికివస్తాయి. రెండు వస్తువుల మధ్య యితరులకు స్ఫురించని సామ్యాన్ని చూడటంలోనే కవి ప్రతిభ దాగి ఉంటుంది. పోలికల గురించి చెప్పాలంటే, బహుళ పంచమినాటి చంద్రుడు ఆకాశంలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా ఉన్నాడని శ్రీశ్రీ చెప్పినదాని దగ్గర్నించి, బావి భూమి బుగ్గపై ముడుచుకున్న నవ్వు సొట్టలా ఉందని ఇస్మాయిల్ చెప్పినదాని వరకు అనేక ఉదాహరణలు తీసుకోవచ్చు. సమకాలీన కవులలో, కొంత అసాధారణమైన, అరుదైన ప్రతీకలు తీసుకోవటం మనకు కనిపిస్తుంది. ఉదాహరణకు, శివారెడ్డి 'నిశ్శబ్దంగానే' అనే పద్యంలో వాడిన పోలికలు చూడండి...

"నేను నిశ్శబ్దంగానే వెళ్ళిపోతాను
నిరుడు కమ్మిన మబ్బులా
.......

అద్దంమీంచి జారుతున్న నీటిబొట్టులా
స్నానం చేస్తూ గోడకంటించిన బొట్టులా"

అలాగే వేగుంట మోహనప్రసాద్(మో) 'శిలవర్ణాల్లోశిల్పం' అనే పద్యంలో చెప్పిన ఒక విచిత్రమైన పోలిక

"మిట్టమధ్యాహ్నం పొట్టమీద పెట్టుకున్న పుచ్చుకాయ బుజ్జిపాపాయి"

రావిశాస్త్రి వంటి రచయితల కథల్లో కూడా చాలా ప్రతిభావంతమైన పోలికలు కనిపిస్తాయి. పోలిక చెప్పే పనిని ఆయన కొన్ని సమయాల్లో చెప్పే విషయానికి పరిపుష్టిని కలిగించటానికుపయోగించినా, మరికొన్నిసార్లు కేవలం ఉపమించటంలో ఉండే ఆనందం కోసం చేశారనిపిస్తుంది. ఎక్కడో ఒక కథలో ఆయన మగవాడి చూచు కాలు కుంకుమభరిణె మూతల్లా ఉన్నాయని రాశారు!

రెండు వస్తువులను పోల్చటం కంటె, రెండు అనుభవాలను పోల్చటం ఇప్పటి కవుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వస్తువులకు సంబంధించిన పోలికల కంటె వీటిని చదివినప్పుడు కలిగే అనుభూతి సాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి ప్రయోగాల్లో అతిసున్నితమైన, విలక్షణమైన అనుభవాలను కవులు స్పృశించారు.

"ఆ చెట్టు నీడన కూచుంటే
అప్పుడే అల్లిన
పచ్చికొబ్బరాకు చాపమీద
నగ్నంగా పడుకున్నట్టుంటుంది.
తెగిన గాయంమీద
గోర్వెచ్చని నీళ్ళు పడ్డట్టు
అది ఖేదమో, మోదమో తేల్చుకోలేనట్టుంటుంది."
(బాధల చెట్టు శిఖామణి)

ఇందులో వాడిన రెండు ప్రతీకలు ఒక అనిర్వచనీయమైన అనుభూతిని పాఠకునికి అందజేస్తాయి.

పదచిత్రంపై చేసిన ప్రయోగాల్లో, ఒక పదచిత్రాన్ని పొడిగించటం అనేది కూడా ఒకటి. ఇది రెండు రకాలుగా చెయ్యవచ్చు. ఒకే పోలికను రెండు వేరు వేరు వస్తువులకు ఆపాదించటం లేదా ఒకే వస్తువుకు రెండు దగ్గర సంబంధం ఉన్న పోలికలు వాడటం. ఉదాహరణకు, ఇస్మాయిల్ 'బావి' అనే పద్యంలో నుంచి

ఈ క్రింది వాక్యాలు తీసుకొందాం

"నీడల విసనకర్ర విప్పి
ఎండలో సేద తీరుస్తుంది చెట్టు
నీడల మడత విసనకర్ర బావి
వాడుకొమ్మంటుంది చేదతో విప్పి."

ఇందులో చెట్టు, బావి రెండింటిని విసనకర్రతో పోల్చటంవల్ల, ఒకటి తెరుచుకొని ఉంటే, మరొకటి మూసుకొని ఉందని చెప్పటంవల్ల ఒక గొప్ప అందం వచ్చింది. రెండవ ఉదాహరణగా, ముకుంద రామారావు కవిత 'సాయంసంధ్య' లో వయసు పైబడుతున్న యిద్దరు దంపతుల మధ్య పెరిగిన దూరాన్ని గురించి రాసిన ఈ వాక్యాలు తీసుకోవచ్చు.

"ఆకర్షణై కొన్నాళ్ళు
పిల్లల వారధితో ఇంకొన్నాళ్ళు
తెలియనే లేదు.
ఎంత తొందరగా కరిగిపోయిందో
వారధి కూడా!
వీలున్నపుడెపుడో
ఇరువైపులా చేరుతూ
పడవలై పోయిన పిల్లలు"

పిల్లల్ని మొదట వంతెనతోనూ, తరువాత పడవలతోనూ పోల్చటం, పడవకు, వంతెనకు ఉన్న అనులోమ సంబంధం ఇక్కడ ఎంతో మంచి ప్రభావం కలిగించాయి. రెండు ఒడ్డుల్ని కలపటమనే సామాన్య లక్షణంతోబాటు వంతెనకు, పడవకు ఉన్న అనేక భేదాలు ఈ పదచిత్రంలో పలు లోతుల్ని చూడటానికి వీలు కల్పిస్తాయి. ఒక పదచిత్రాన్ని ఇంత బాగా పొడిగించటం అన్నివేళలా సాధ్యపడే విషయం కాదు.

కొన్నిసార్లు ఒక పదచిత్రంలో ప్రత్యక్షమైన పోలిక ఏదీ ఉండనక్కర్లేదు. ఒక దృశ్యాన్ని తలపింపజేసే సున్నితమైన వివరణ, చిత్రమైన ఊహ లేదా మానవీకరణ వంటివాటితో కూడా బలమైన పదచిత్రాలు నిర్మించవచ్చు.

"మీసాలు దువ్వుతుంది బొద్దింక " (సాలీడు యదుకుల భూషణ్)

# కవిత్వంలో నేను

**బ**హుశ అందరికీ తెలిసినదే ఒక కథ ఉంది. ఒక వేళ కాని వేళ శ్రీరాముడికి నేనెవరన్న సందేహం కలుగుతుంది. వెంటనే వశిష్ఠులవారి ఆశ్రమానికి వెళ్ళి, తలుపు తడతాడు. లోపల్నించి "ఎవరదీ?" అన్న ప్రశ్న వినిపిస్తుంది. "నేనే గురువర్యా!" అంటాడు రాముడు. "నేనంటే?" మళ్ళీ ప్రశ్న. "అది తెలుసుకుందామనే వచ్చాను!" అంటాడు రాముడు. ఆ తరవాత, ఆయన అసలు ప్రశ్నకి సమాధానం దొరికిందో లేదో తెలియదుగానీ, "నేనెవరు?" అన్నది అనాదిగా మనిషిని వేధిస్తున్న ఒక తాత్విక ప్రశ్న. అయితే, అంత లోతుగా తాత్విక చర్చ చెయ్యటం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. కేవలం కవిత్వానికి సంబంధించినంత వరకు కవులు ఈ నేననేదాన్నెలా ఉపయోగించుకున్నారో పరిశీలించటం వరకే ఇది పరిమితం.

ఇందులో ప్రధానంగా మూడు ధోరణుల గురించి మనం చెప్పుకోవచ్చు. మొదటిది చాలా సరళమైన పద్ధతి. అంటే, కవి తనను గురించి చెప్తూ, ఉత్తమ పురుషలో మాట్లాడటం. ఇక్కడ "నేనంటే నేనే!"

"ఆలోచనలతో ప్రాంగణమంతా
అందంగా అలుకుతాను.
ఉత్సాహంతో ఊహల తోరణాలు కడతాను.
ఎవరెవరు వస్తారా అని
ఎంతగానో ఎదురు చూస్తాను
నా ఆరాటమేగాని,

నేనెవర్నీ లోపలికి ఆహ్వానించలేను."

(అనావిష్కృతం)

ఇందులో కవి వ్యక్తిగతమైన ఒక అనుభవాన్ని మనతో పంచుకుంటున్నాడని మనకు అర్థమౌతుంది. అలాగే, పాఠకుణ్ణి ఉద్దేశించి నువ్వని రాయటం కూడా సరళమైన పద్ధతే. "ఏ దేశమేగినా ఎందు కాలిడినా / పొగడరా నీ తల్లి భూమి భారతిని". కవిత చదివే ప్రతి పాఠకుడికీ ఈ నువ్వనేది వర్తిస్తుంది.

రెండో పద్ధతి ఒక వ్యక్తిని గురించి ఉత్తమ పురుషలో మాట్లాడటం. కవి ఎవరిలా మాట్లాడుతున్నాడనేది శీర్షికలోగాని మరెక్కడైనా గాని మనకు స్పష్టంగా సూచింపబడుతుంది. కొన్నిసార్లు శీర్షికలో స్వగతమనో మోనోలాగ్ అనో ఉంటుంది. అలా లేకపోయినా, పద్యంలో చెప్పబడిన దాన్నిబట్టి ఎవరనేది మనం తేలిగ్గా ఊహించవచ్చు. ఉదాహరణకి, శివారెడ్డి 'కమలకుమారి స్వగతం' అనే కవితను చెప్పుకోవచ్చు. "నా పసితనం మీద నిర్దాక్షిణ్యంగా నడిచి వెళ్ళాడు" అని మొదలై, సుదీర్ఘంగా సాగే ఈ కవితలో, వంచింపబడిన ఒక అభాగిని మాటలు మనం వింటాం.

ఇటువంటి పద్యాల్లో వస్తువు వ్యక్తులే కానక్కర్లేదు. ఒక భౌతికమైన వస్తువు కూడా కావచ్చు. ఇస్మాయిల్‌గారు 'సీసా' అని ఒక పద్యం రాసారు. ఇందులో సీసాయే మాట్లాడుతుంది :

"విషానికి విషపు రంగు
విస్కీకి విస్కీ రంగు
తాలుస్తానని
నేనంటే నీకు లోకువ.
నాలోంచి కనిపించేది
నీ ఆకాశమే ననుకుంటున్నావు.
అసలు నా ఆకాశమే వేరు.
నా నోటి దగ్గర చెవి పెట్టి చూడు :
నాలో నిరంతరం రేగే
గాలిదుమారాల్ని వింటావు."

ఇటీవల మన యదుకుల భూషణ్ నీడ, సోఫా, లాంపు, తలుపు మొదలైన

అనేక వస్తువుల గురించి రాసిన ఇటువంటి కవితలు కొన్ని 'ఈమాట'లోనే ప్రచురింపబడ్డాయి.

ఇక మూడో పద్ధతిలో కవి వ్యక్తిగతం కాదని మనకు తెలుస్తూనే ఉన్నా, ఎవరి గురించి మాట్లాడుతున్నాడనే దానికి ఇంత స్పష్టమైన సూచన ఉండదు. ఇందులో రెండు రకాలు. మొదటిది ఒక సార్వజనీనమైన అర్థంలో నేను అని వాడటం. ఉదాహరణకి వంశీకృష్ణ రాసిన ఈ కవిత చూడండి :

"నిన్న రాత్రి మృత్యువు నా కలలోకి తొంగిచూసి
రేపు ఉదయం తలుపు తట్టనా అంది.
అమాయకమైన నా భార్య మొహం
తన నునులేత ఒంటిపై నా వదలని మోహం
గుర్తుకొచ్చాయి..?
పసితనాన్ని వదలని మా అమ్మాయి
ఒకానొక అవ్యక్త ప్రేయసి కనుదోయి
ఆరడి పెట్టాయి..?
మృత్యువు వంక తిరిగి
యింత తొందరగానా .. అన్నాను.
తను నవ్వేసి వెళ్ళిపోయింది.
ఓ యాభై ఏళ్ళ తర్వాత ....
మృత్యువు ముందు
దీనంగా ... హీనంగా ...
కరుణించమని వేడుతూ .. నేను." (ఫస్ట్ లవ్)

ఇందులో 'నేను' ఎవ్వరైనా కావచ్చు. అంటే, కవితోబాటు ప్రతి మనిషికీ అది వర్తిస్తుంది.

రెండవ రకం దీనికంటె కొంత క్లిష్టమైనది. ఇందులో కవి ఎవరినో ఉద్దేశించినట్టు కనబడుతుంది గాని, అది ఎవరనేది స్పష్టంగా తెలియదు. ఇటువంటి వాటికి కొంత వ్యాఖ్యానం అవసరమౌతుంది. వ్యాఖ్యానాల్లో భేదాలుండవచ్చు కూడా. ఉదాహరణకి శ్రీ శ్రీ 'జయభేరి' పద్యంలో ఈ వాక్యాలు తీసుకుందాం.

# దేవుని పాత్ర

ఇది ఆధ్యాత్మిక ప్రసంగం కాదు. కవిత్వానికి, అందులోనూ వచన కవిత్వానికి సంబంధించిన ఒక చిన్న పరిశీలన మాత్రమే. దేవుడనే భావనను ఆధునిక కవులు వివిధ రకాలుగా ఎలా ఉపయోగించుకున్నారనేది పరిశీలించటం దీని ముఖ్యోద్దేశం.

భౌతిక ప్రయోజనాలకి, అవసరాలకి అతీతమైన ఒక ఆనందాన్ని, అనుభవాన్ని పొందే శక్తి మానవజాతికి సహజంగా ఉంది. సంగీతం, సాహిత్యం, నృత్యం వంటి కళలవల్ల వాటిని సృష్టించిన వారికి, ఆస్వాదించిన వారికి కలిగే రససిద్ధి, రసానందం ఇటువంటివే. ఆధ్యాత్మిక అనుభవం కూడా వీటితో పోల్చదగిందే అని నాకనిపిస్తుంది. అంటే వాటిని ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవలసిందే గాని, వేరొకరికి వివరించి చెప్పటం అసాధ్యం. ఈ అనుభవాలన్నిటిలోనూ వివిధ స్థాయిలుంటాయి. అందులో ఉన్నతస్థాయి నందుకోవటానికి సాధన, సంస్కారం అవసరమౌతాయి. అది అందుకోలేనివారు, అటువంటి స్థితి ఉందని నిరూపించటానికి భౌతిక సాక్ష్యాల కోసం చూస్తుంటారు – తాన్‌సేన్ దీపక్ రాగం పాడి దీపాలు వెలిగించాడని, వేరెవరో మేఘమల్హార్ పాడితే వర్షం కురిసిందని, పోతనగారు పద్యం రాస్తూ మధ్యలో వదిలిపెట్టి వెళితే రాముడు వచ్చి పూరించాడని – ఇలా. ఆధ్యాత్మికరంగంలో మహిమలు, హీలింగ్ పవర్స్ కూడా అటువంటివే. ఈ ఉదంతాలు నిజమే అనుకున్నా, ఆయా ప్రక్రియలు అందించే విశిష్ట అనుభవాన్ని స్వయంగా పొందినవారికివి అల్పంగా, అప్రధానమైనవిగా కనిపిస్తాయి. అయితే, అటువంటి అనుభవం పొందామని

చెబుతున్ననవారి నిజాయితీని అంగీకరిస్తూనే, అది మెదడు కల్పిస్తున్న ఒక భ్రమ ఎందుకు కాకూడదని ఎవరైనా ప్రశ్నిస్తే, సమాధానం చెప్పటం కష్టం. Botany of Desire అన్న పుస్తకంలో రచయిత Michael Pollan ఒక చిత్రమైన వాదన చేస్తాడు. యోగులు, సిద్ధులు, అలౌకికానుభవం పొందినవారు మధ్యయుగాల్లో ఎక్కువగా ఉండేవారని, ఇప్పుడు వారి సంఖ్య తక్కువని చెబుతూ, దానికి అప్పట్లో malnutrition అధికంగా ఉండటమే ముఖ్యకారణమని అంటాడు. పోషకాహార లోపంవల్ల మెదడు రకరకాల గమ్మత్తులు చేస్తుందని, ఇది కూడా అందులో భాగమేనని అతని వాదన. ఇటువంటివి వినటానికి బాగానే ఉంటాయిగాని, నిరూపించటం కష్టం. ఏది ఏమైనా, అధ్యాత్మిక అనుభవం కూడా కళలవల్ల కలుగుతున్న రసానందం వంటిదే అన్న ప్రతిపాదన మాత్రం కాస్త ఆలోచింపదగినది.

వీటి మధ్య సామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళి, ఈ రెండూ ఒకటేనని, లేదా ఒకదాని ద్వారా మరొక అనుభవం సాధించటం సాధ్యమని మనవారు భావించారని సాంప్రదాయిక కళలు చూస్తే మనకర్థమౌతుంది. సంగీతమే కాదు, సాహిత్యం కూడా భక్తివినా సన్మార్గము కాదని మనవారు విశ్వసించారు. శృంగార ప్రధానాలైన ప్రబంధాలు కూడా పురాణ ఇతివృత్తాల మీదే ఆధారపడటం వల్ల, వాటిలో శృంగారం ప్రధాన రసమే అయినా, భక్తి కూడా అంతర్లీనంగా మిళితమై ఉంటుంది. భావకవిత్వం వచ్చేసరికి ఇది రాధాకృష్ణుల ప్రణయాన్ని, విరహాన్ని వర్ణించటంగా రూపుదిద్దుకుంది. ఇందులో కృష్ణుడు ప్రేమకి, భక్తికి ప్రతీకగా నిలుస్తాడు. చిన్నికృష్ణుడు బాల్యంలో ఉండే స్వచ్ఛతకి, ఆనందానికి ప్రతిరూపం. కృష్ణశాస్త్రిగారి అన్వేషణ, కొడాలి ఆంజనేయులు రాధ, బసవరాజు అప్పారావు గోపిక, చింతా దీక్షితులు కృష్ణమ్మ, చిన్నికృష్ణుడు వంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. వీటిలో ఏ కవితా పాఠాన్నయినా వివరంగా చూడవచ్చు గాని, పరిశోధకులకు కూడా ఆసక్తి కలిగించే ఒక ఖండిక తీసుకుంటాను. ఇది కృష్ణుని మురళీగానం గురించి కేతవరపు కృష్ణమూర్తి అనే ఆయనతో కలసి శ్రీశ్రీ జంటగా రాసిన కవిత – 1930లో భారతిలో ప్రచురితమయింది. శ్రీశ్రీ సరదాకైనా జంటకవిత్వం రాసారనే విషయం ఇది చూసేదాకా నాకు తెలియదు. ఈ శ్రీనివాసరావు వేరొకరెవరైనా కావచ్చా అంటే, 1931లో ప్రచురితమైన

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kavitwamlo+Nenu**

* * *